# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 12 మార్చి, 2026 | పేజీలు :08


# పైప్‌లైన్ లీకేజీతో కలుషిత నీటి సరఫరా

## పట్టించుకోని పంచాయతీ యంత్రాంగం



**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట్ మండలంలోని చేడ్వాయి గ్రామస్థులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని కుమ్మరివాడలో ఉన్న మంచినీటి సరఫరా బోర్ వద్ద పైప్‌లైన్ లీకేజీ ఏర్పడటంతో బెస్తవాడ ప్రజలకు కలుషిత నీరు సరఫరా అవుతోంది. పైప్‌లైన్ పగిలి నీరు వృథా కావడమే కాకుండా, ఆ గుంతల్లోకి చేరుతున్న మురుగు నీరు తిరిగి పైపుల ద్వారా ఇళ్లకు చేరుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టే క్రమంలో గతంలో బోర్ వద్ద ఉన్న షెడ్డును తొలగించారు. అయితే పనులు పూర్తయిన తర్వాత తిరిగి షెడ్డు నిర్మించకపోవడంతో బోర్ ప్రాంతం అపరిశుభ్రంగా తయారైంది. ఈ సమస్యపై గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జయశ్రీలకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కాలనీ వాసులు స్వచ్ఛమైన నీటి కోసం మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి బోర్ వద్ద లీకేజీలను అరికట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. కొత్తగా షెడ్డును నిర్మించి కాలనీ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

# వేసవి కాలం.. కిడ్నీలు పైలం

ఒంట్లోకి చేరని నీళ్లు.. కిడ్నీల్లో రాళ్లు | నొప్పి తగ్గిందని ఊరుకుంటే ప్రాణాంతకం

నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ ఫెయిల్యూర్ ప్రమాదం | జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ రాళ్ల బాధితులు

**ప్రజాపక్షం /- కరీంనగర్ టౌన్ :** వేసవికాలం వచ్చిందంటే చాలా మందిలో సరిపడా నీరు తాగే అలవాటు గణనీయంగా తగ్గిపోతుంది. దాహం వేస్తున్నని ర్లక్ష్యం చేయడం, చెమట ఎక్కువగా రావడం వల్ల శరీరానికి అవసరమైనంత నీరు అందడం లేదు. ఇదే సమయంలో కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కాలంలో కిడ్నీ రాళ్ల బాధితుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు. వేసవికాలంలో ఏర్పడే కిడ్నీ రాళ్లు నిర్లక్ష్యం చేస్తే చివరకు అవయవం వైఫల్యానికి కూడా దారి తీయవచ్చని స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా కిడ్నీలు రక్తాన్ని వడపోసి మలినాలను మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. శరీరంలో నీటి పరిమాణం తగ్గినప్పుడు మూత్రం సాంద్రత పెరుగుతుంది. ఇందులోని తరువాయి 2లో





# ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనితీరు

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని మనమంతా విజయవంతం చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బుధవారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ రంగాపూర్ లోని రాధాకృష్ణ ఏసీ కన్వెన్షన్ హాల్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 99 రోజుల కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని, సర్పంచ్ నుంచి మంత్రి వరకు ప్రతి ఒక్కరూ స్థానికంగా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పెండింగ్ ఫైల్స్ పరిష్కారం, పరిశుభ్రత గురించి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. రాజకీయ జీవితాన్ని తాను స్థానిక సంస్థ నాయకునిగా ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మన పనితీరు ఉండాలని తెలిపారు. ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకుంటూ తరువాయి 2లో

# విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి


2

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్


2

# శిక్షణ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలన

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

## చలివేంద్రం ప్రారంభించిన ఎస్సై



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి పట్టణంలోని ప్రధాన రహదారి మార్గంలో చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంను చొప్పదండి ఎస్సై నందిరెడ్డి నరేష్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కొంతమంది మిత్రులు కలిసి గత ఆరు సంవత్సరాలుగా ఇలాంటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఓదెల రాజయ్య జ్ఞాపకార్థం 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జిట్టా కుమార్, మహేసుని మల్లేశం, మహమ్మద్ చాంద్ పాషా, చిట్యాల శ్రీకాంత్, ఓదెల శ్రీకాంత్, ఎలిగేటి చంద్రశేఖర్, పిట్టల మహేష్, కోటగిరి ప్రశాంత్, రాజు, సునీల్, శేఖర్‌లున్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి పట్టణంలోని 12వ వార్డుకు చెందిన మచ్చ బుచ్చవ్వ అనారోగ్యంతో మరణించారు. బుధవారం బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు బత్తిని ప్రశాంత్ వారి కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బొడిగె వెంకన్న, అద్దకం మల్లేశం, బొడిగె కృష్ణవేణి, బూరుగు శ్రీనివాస్, కిరణ్, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనుల పరిశీలన



**ప్రజాపక్షం/చొప్పదండి :** చొప్పదండి పురపాలక సంఘం పట్టణ పరిధిలోని 4,5వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా బుధవారం సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వడ్లూరి సరిత, 4వ వార్డు కౌన్సిలర్ కనుమల్ల రాజశేఖర్, 5వ వార్డు కౌన్సిలర్ వడ్లూరి అనూష, మున్సిపల్ కమిషనర్ టి.మనోహర్‌లతో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ డి.ప్రశాంత్ కుమార్, ఇంచార్జి సానిటరీ ఇన్స్‌పెక్టర్ ఎ.అంజయ్య, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, ఎస్.శివాణి, స్థానిక ప్రజాప్రతినిధులు వడ్లూరి శ్రీనివాస్, వడ్లూరి శ్యాంసుందర్ తదితరులున్నారు.

# వేసవి కాలం .. కిడ్నీలు పైలం

(మొదటిపేజి తరువాయి)

కాల్షియం, ఆక్సలేట్, యూరిక్ యాసిడ్ వంటి లవణాలు కలిసి కిడ్నీలో రాళ్లుగా మారుతాయి. వేసవికాలంలో నీరు తక్కువగా తాగడం, అధిక ఉప్పు ప్రొటీన్ ఆహారం తీసుకోవడం, శారీరక చురుకుదనం తగ్గడం ఈ సమస్యను మరింత పెంచుతాయి. కిడ్నీలో ఏర్పడిన రాయి మూత్రనాళంలో అడ్డుపడితే మూత్రం బయటకు వెళ్లకుండా కిడ్నీలోనే నిలిచిపోతుంది. దీంతో కిడ్నీ వాపుకు గురై హైడ్రోనెఫ్రోసిస్ ఏర్పడుతుంది. ఈ స్థితి కొనసాగితే కిడ్నీలోని వడపోత కణాలు (నెఫ్రాన్లు) క్రమంగా దెబ్బతిని కిడ్నీ పనితీరు తగ్గుతుంది. అలాగే రాళ్ల వల్ల కిడ్నీలో ఇన్ఫెక్షన్ ఏర్పడితే పైలోనెఫ్రిటిస్ వంటి తీవ్రమైన సమస్యలు వచ్చి కిడ్నీ కణజాలం శాశ్వతంగా నాశనం అయ్యే ప్రమాదం ఉంది.

**కిడ్నీలో రాళ్లు ఏర్పడితే...**

మూత్రం పరిమాణం తగ్గడం, నడుము భాగంలో తీవ్రమైన నొప్పి, కాళ్లు, పాదాల్లో వాపు, వాంతులు, వికారం, తీవ్రమైన నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సొంత వైద్యం మానుకోవాలి. నొప్పి తగ్గిందని పెయిన్ కిల్లర్లు వాడుతూ కాలం గడపడం ప్రమాదకరం, అవి కూడా కిడ్నీలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. వేసవి కాలంలో రోజుకు కనీసం 35 లీటర్ల నీరు తాగాలి. తరచూ నొప్పి వస్తే, రాయి పరిమాణం 5 మిల్లీమీటర్ల కంటే ఎక్కువగా ఉంటే తప్పనిసరిగా యూరాలజిస్టు సంప్రదించి వైద్యం తీసుకుంటే కిడ్నీ ఫెయిల్యూర్‌ను నివారించవచ్చు.

**నిర్ధారణ, చికిత్స ఇలా..**

రాయి పరిమాణం, అడ్డంకిని తెలుసుకోవడానికి కేయూబి అల్ట్రా సౌండ్, సిటీ స్కాన్ చేస్తారు. కిడ్నీ పనితీరు సామర్థ్యాన్ని అంచనా వేయడానికి సీరమ్ క్రియాటినిన్ జిఎస్ఆర్ పరీక్షలు చేసి నిర్ధారిస్తారు. రాళ్లు పెద్దవిగా ఉన్నప్పుడు లిథోట్రిప్సీ, ఆర్‌ఆర్ ఎస్ వంటి లేజర్ చికిత్స ద్వారా రాళ్లను తొలగిస్తారు.

**నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం**

**డాక్టర్ రవిశంకర్, యూరాలజిస్ట్**



రాళ్లు చిన్నవే కదా నొప్పి తగ్గుతుందని పెయిన్ కిల్లర్స్ వాడుతూ కాలం గడపవద్దు. పెయిన్ కిల్లర్స్‌ను అతిగా వాడడం కూడా కిడ్నీ వైఫల్యానికి ప్రధాన కారణం, మూత్రంలో మంట వచ్చినా తరచూ నొప్పి వస్తున్నా, తప్పకుండా యూరాలజిస్ట్‌ను సంప్రదించాలి. స్టోన్ సైజ్ ఎంత చిన్నదైనా నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ దెబ్బ తినడం ప్రారంభమవుతుంది. అవసరమైన సమయంలో సరైన చికిత్స తీసుకుంటే కిడ్నీ ఫెయిల్యూర్‌ను పూర్తిగా నివారించవచ్చు.

# శిక్షణ కార్యక్రమ ఏర్పాట్ల పరిశీలన

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** "ప్రజా పాలనప్రగతి ప్రణాళిక" కార్యక్రమంపై, ప్రజా ప్రతినిధులకు ఏర్పాటు చేయనున్న అవగాహన కార్యక్రమానికి సంబంధించి తగిన ఏర్పాట్లను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రణాళికపై పట్టణంలోని తిరుమల గార్డెన్స్‌లో గురువారం సర్పంచ్‌లకు, మున్సిపల్ కౌన్సిలర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుదవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలవారీగా కౌన్సిలర్లకు, మండలాల వారీగా సర్పంచ్‌లకు సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమాన్ని నిర్ణీత సమయానికి ప్రారంభించి, సాఫీగా కొనసాగించాలన్నారు. సరైన లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడి తెరలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలని పేర్కొన్నారు.మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. వాహనాలకు తగిన పార్కింగ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. భోజనశాలను పరిశీలించారు. సమావేశానికి హాజరయ్యే వారికి, మంచి ఆహారం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, హార్టికల్చర్ అధికారి రమణ, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రూ.3.36 కోట్లు మంజూరుకు కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** రామగుండం నగరపాలక పరిధిలో పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధిదీపాల సమస్యల పరిష్కారానికి అత్యవసరంగా రూ.3.36 కోట్ల నిధులు మంజూరు చేయాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను బుధవారం కోరినట్లు రామగుండం మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. పెద్దపల్లిలో జరిగిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ నిధుల మంజూరుకై కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుత వేసవికాలంలో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బోర్‌బావుల మరమ్మత్తులు, కొత్త బావుల తవ్వకాలు, పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తులు, విలీన గ్రామాలతో పాటు నీటి సరఫరా లేని ప్రాంతాలకు నూతన పైప్‌లైన్లు ఏర్పాటుకు కోటి రూపాయలు అవసరమన్నారు. వీధి దీపాల విడిభాగాల కొనుగోళ్లు, కొత్త వీధి దీపాలు, కూడళ్లలో మినీ హైమాస్ లైట్లు ఏర్పాటుకు రూ.1.36 కోట్లు, పారిశుద్ధ్య వాహనాల మరమ్మత్తులు, బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనుగోళ్లకు కోటి రూపాయలు ఖర్చు అవుతాయన్నారు. నగరపాలక సంస్థ ఖాజానాలో నిధుల కొరత వల్ల సీఎస్సార్, డిఎంఎఫ్‌టి లేదా ఇతర నిధుల నుంచి రూ.3.36 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్‌లతోపాటు కలెక్టర్‌ను కోరినట్లు మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. ఈ మేరకు ఆయా పనులకు సంబంధించి అంచనా ప్రతిపాదనలను కలెక్టర్‌కు అందజేసినట్లు ఆయన తెలిపారు.

# ఆధునీకరణ బాటలో మార్కెట్ యార్డు

### వేబ్రిడ్జి, ఓపెన్ షెడ్ల నిర్మాణానికి పాలకవర్గం ఆమోదం

**ప్రజాపక్షం/పెగడపల్లి :** వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో యార్డు అభివృద్ధిపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుల సహకారంతో పెగడపల్లి మార్కెట్ యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యంగా రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో కొత్తగా వేబ్రిడ్జి (ధర్మకాంటా) మరియు ఓపెన్ షెడ్ల నిర్మాణానికి పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి సర్పంచ్ ఓరుగల అరుణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఏ.వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు చాట్ల విజయభాస్కర్, మ్యాకల మల్లయ్య, అంజన్న నాయక్, శ్రీరామ్ అంజయ్య, బాలుసాని శ్రీనివాస్, చెట్ల కిషన్, మన్నె గంగరాజం, తౌటు లావణ్య, లింగంపల్లి మహేష్, సంకిటి శ్రీకాంత్ రెడ్డి, అడుప తిరుపతి, దేశెట్టి లక్ష్మీ రాజం సిబ్బంది మాదారపు కిషన్ రావు, కొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనితీరు

(మొదటిపేజి తరువాయి)

క్షేత్రస్థాయి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. రాబోయే వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ త్రాగు నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యలను కలెక్టర్ దృష్టికి ఎప్పుడు తీసుకుని వెళ్లిన వెంటనే స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తున్నారని మంత్రి అభినందించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ సర్పంచ్, మున్సిపల్ ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలు, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గురించి అవసరమైన అవగాహన అందించేందుకు ఏర్పాటుచేసిన ఈ శిక్షణ కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిన గత 2 సంవత్సరాల కాలంలో గత పాలకులు ఖజానా ఖాళీ చేసినప్పటికీ ప్రభుత్వ సిబ్బందిని ఎక్కడ ఇబ్బంది పెట్టకుండా ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు అమలు చేస్తూ అద్భుతమైన పాలన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో ప్రజలకు అధికంగా పనికి వచ్చే పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని, రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య నిర్వహణ, చెట్ల పెంపకం పై కూడా స్థానిక ప్రజాప్రతినిధులు శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో రామగుండం మేయర్ మహంకాళి స్వామి, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్‌లు, సర్పంచులు, సంబంధిత జిల్లా అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కోరారు. గ్రేటర్ అట్లాంట తెలంగాణ సోసైటీ, చెస్ నెట్‌వర్క్‌ల ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్ విద్యార్థులకు చెస్ బోర్డులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరై విద్యార్థులకు చెస్ బోర్డులు, వివిధ ఆట వస్తువులు పంపిణీ చేసి మాట్లాడారు. చెస్ ఆడడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తితో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. నేటి యుగం విద్యార్థులు క్రీడలకు దూరంగా ఉంటూ మొబైల్ ఫోన్‌కు బానిసలు కావడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువునే విద్యార్థులకు అన్ని మౌళిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని వివరించారు. తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను క్రీడల వైపు ఆకర్షితులు అయ్యే విధంగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, కౌన్సిలర్ అరవ లక్ష్మి , ప్రిన్సిపల్ చంద్రకళ , ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆనంద్ రావు, అమర్‌నాథ్ రెడ్డి, చెస్ నెట్ వర్క ఫౌండర్ సుధీర్, గ్రేటర్ అట్లాంట తెలంగాణ సోసైటీ అధ్యక్షుడు గంద్ర వెంకటరమణ రావు, కోఆర్డినేటర్లు సురేష్, వేణుగోపాల్ రావు తదితరులు ఉన్నారు.

## ఎస్‌బిఐ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నూతన బ్రాంచ్‌ను ఆ శాఖ డీజీఎం బిజయ కుమార్ బుధవారం ప్రారంభించారు. మల్లాపూర్ మండల ప్రజల సౌకర్యార్థం ఎస్బిఐ శాఖను ఏర్పాటు చేసినట్లు ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ రవీంద్ర కుమార్, బ్రాంచ్ మేనేజర్ పోడేటి సత్యనారాయణ, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.



# ఐకెపి కార్యాలయం ముందు నిరసన



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం ముందర రేగుంట మాజీ వివోఏ ఇనుగుర్తి సరిత బుధవారం నిరసన చేపట్టారు. రేగుంట గ్రామ వివోఏగా తనకు గ్రామంలోని మహిళా సంఘాల సభ్యురాళ్ళు ఓటు వేసుకొని ఎన్నుకొని తీర్మానం కూడా చేశారని కానీ అట్టి తీర్మానాన్ని ఆమోదించకుండా వివోఏగా పని కల్పించకుండా నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని భరించలేక కార్యాలయం ఎదుట నిరసన చేపట్టినట్లు తెలిపారు. సంబంధిత ఐకెపి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి మహిళా సభ్యుల తీర్మానాన్ని ఆమోదించి తన ఉద్యోగాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగింది. ఈమెతోపాటు గ్రామానికి చెందిన కొందరు మహిళలు పాల్గొన్నారు.

# పాడి పశువుల పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/పెగడపల్లి :** ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పాడి పశువుల పథకం (పైలెట్ ప్రాజెక్ట్) కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెగడపల్లి ఎంపీడీఓ శశి కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి పెగడపల్లి మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన ఎస్సీ సామాజిక వర్గ అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తుదారుల వయస్సు 60 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలతో కూడిన దరఖాస్తులను స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఈ ప్రకటన వెలువడిన 15 రోజులలోపు దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని, అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

# అభివృద్ధే ధ్యేయం

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో ఎస్సి కాలనీలో వాటర్ ట్యాంక్‌ను సర్పంచ్ నక్క రాజేశ్వరి రాజయ్య ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల క్రితం నిర్మించిన ఎస్సీ కాలనీ లో గత మూడు వాటర్ ట్యాంక్ నిర్మించి ఓపెన్ చేయకుండా కలెక్షన్లు ఇయ్యకుండా అలాగే ఉంచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బద్రి నాయక్ ,వార్డు సభ్యులు శ్రీశైలం, మెంత్రి నర్సయ్య, కాలనీ ప్రజలు మంథని రాజు, సతీష్, నాని సమ్మయ్య, రాచర్ల రమేష్, ఏకు సమ్మయ్య, సతీష్ లు పాల్గొన్నారు.



# స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** మూడు దశబ్ధాలుగా జగిత్యాల జిల్లా ప్రజలకు ఆపీ, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు అభినందనీయమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సత్యహరిచంద్ర స్మశాన వాటికలో ఆపీ, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరై మొక్కలు నాటి మాట్లాడారు. హైదరాబాద్ మహా ప్రస్థానం తరహాలో జగిత్యాలలో ఉన్న సత్యహరిచంద్ర స్మశాన వాటికలో సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్లు అరవ లక్ష్మి , సిరికొండ పద్మ సింగారావు, రాగుల ప్రదీప్ కుమార్, పిట్ట ధర్మరాజు, బొలుసాని శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు చారి, రెడ్ క్రాస్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీవీ సూర్యం, బొడ్ల జగదీష్, నాయకులు గోలి శ్రీనివాస్, సుధాకర్ రావు తదితరులు ఉన్నారు. అలాగే జగిత్యాల జిల్లా ఆత్మ చైర్మన్‌గా నియామకం అయిన కాటిపెల్లి గంగారెడ్డి బుధవారం ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజెంగి నందయ్య తదితరులు ఉన్నారు.

# ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



## బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మి నారాయణ డిమాండ్ చేశారు. వితంతులకు ఆసరా ఫించన్ రూ.4,016కు పెంచాలని కోరుతూ జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లతను బీసీ సంఘం నాయకులు లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా ఆరు గ్యారెంటీ పథకాలు నేటికి పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అర్హులైన వితంతువులను గుర్తించి ఫించన్లు మంజూరు చేసి వారికి అండగా నిలువాలన్నారు. ప్రభుత్వం చేడుతున్న 99 రోజుల ప్రజాపాలనలో కొత్త ఫించన్లు మంజూరు చేయని పక్షంలో రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వంజరి సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ఆరె శంకర్, యూత్ కోఆర్డినేటర్ హృశికేష్, జిల్లా బీసీ సంఘం నాయకులు వెన్న మహేష్, కాసారపు సతీష్ గౌడ్, రాపర్తి రవి, యాగండ్ల రమేష్ గౌడ్, జాజాల రమేష్, బందెల మల్లయ్య, పిండేరు శ్రవణ్ కుమార్, పాపంక శ్రీనివాస్, ద్యావనపెల్లి శంకర్, రాజేశం, దాత్రిక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, సీమంతం



**ప్రజాపక్షం/కోరుట్ల :** కోరుట్ల పట్టణంలోని మార్కండేయ వీధి 1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన, సీమంతం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు, గర్భిణీల శ్రేయస్సు లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా తల్లులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి అంగన్‌వాడీ సిడిపిఒ మణిమ్మ కౌన్సిలర్ కలాల రాధాసాయిచంద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ కలాల రాధాసాయిచంద్ మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించగా, గర్భిణీ స్త్రీలకు సీమంతం కార్యక్రమం నిర్వహించి ఆశీర్వదించారు. పిల్లల తల్లులు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్ అనిత, మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రతి నెల 5 సంవత్సరాల పిల్లలు బరువులు తీయాలి 3 నుండి 5 సంవత్సరాల పిల్లలను అంగన్వాడి కేంద్రానికి పంపించాలి. అంగన్వాడి సేవలను వినయోగించుకోవాలని కోరారు. అనంతరం కొత్తగా ఎనికైన కౌన్సిలర్ కలాలా రాధాసాయి చంద్‌కి సన్మానం చేశారు.

# మదర్ థెరెస్సా కళాశాలలో వీ హబ్ శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో వీహబ్ వారి ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థినిలకు జాబ్ రెడీనెస్ అను అంశంపై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇందులో భాగంగా వీ హబ్ యొక్క రిసోర్స్ పర్సన్ సూహిత మాట్లాడుతూ కళాశాలలో వీహబ్ కి సంబంధించి అత్యాధునిక సౌకర్యాలు కల్పించబడ్డాయని పేర్కొన్నారు. ఈ యొక్క శిక్షణ తరగతులు వారం రోజుల పాటు కొనసాగుతాయని, విద్యార్థినిల నైపుణ్యం మెరుగుపరచుటకై మరిన్ని శిక్షణలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ ఎడవెల్లి నవీన్ మాట్లాడుతూ తమ కళాశాల పెద్దపల్లి జిల్లాలో మొదటి కళాశాలగా వీహబ్ వారిచే MoU కుదుర్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ ఎ. నవత మాట్లాడుతూ వీ హబ్ యొక్క ప్రణాళిక విద్యార్థినిల ఉద్యోగ సాధనలో ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ తమ కళాశాలలో 100% ప్లేస్మెంట్ లక్ష్యంగా అత్యుత్తమ ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఇందుకు గాను వీహబ్ యొక్క తోడ్పాటు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ పి.పవన్ కుమార్, ఎంబీఏ విభాగాధిపతి మరియు ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కన్నం. వెంకటేశ్వర్లు, అనిల్, రమ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.




# ఆటపాటలతో వీడ్కోలు

**ప్రజాపక్షం/పెగడపల్లి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు లింగంపెల్లి లచ్చయ్య సరస్వతీ మాత చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను, ఉపాధ్యాయులతో గడిపిన తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాడిన పాటలు అందరినీ అలరించాయి. విద్యార్థుల కేరింతలతో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల పేరు నిలబెడతామని విద్యార్థులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. అనంతరం అందరూ కలిసి మిఠాయిలు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, జ్యోతి, శంకరయ్య, శ్రావన్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, విజయకుమార్, వేణుగోపాల్, పరమేశ్వర్, శ్రీధర్, మంజుభార్గవి, రమేష్, అనురాధ, అహమ్మదుఖాన్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించండి



## మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు కునారం రోడ్డులోని పబ్లిక్ టాయిలెట్ వద్ద మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పెద్దపల్లి పట్టణ ప్రజలు రోడ్లపై చెత్త వెయ్యకుండా తమ ఇండ్లలో నుండి వచ్చే చెత్తను తడి పొడి చెత్తగా వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని అలాగే పెద్దపల్లి పట్టణాన్ని స్వచ్ఛ పెద్దపల్లిగా మార్చడానికి ప్రతిఒక్కరు సహకరించాలనని అన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ మాట్లాడుతూ వార్డు ప్రజలు పరిశుభ్రతను పాటిస్తూ మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కౌన్సిలర్ గుజ్జుల కుమార్, , నల్లాల పద్మ సురేష్, ఐదవ వార్డ్ ఆఫీసర్ అరవింద్, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కెజిబివి విద్యార్థినులకు విద్యా సామాగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం కెజిబివి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిలకు ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఉమ్మడి రామగుండం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణి చేశారు. భారత మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయునిలను శాలువాలతో సంఘం పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు ఇండిబెల్లి రవీందర్‌కుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన, ఉపాధ్యాయురాళ్లు లత, హరిత, సంఘం నాయకులు కాంపెల్లి సంతోష్, మౌటం రమేష్, దాడి మహేష్, కొంకటి మనోహర్‌లు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ మండలం మారుపాక రైతువేదిక రైతు వేదికలో ATMA (అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ) ఆధ్వర్యంలో భూసార ఫలితాల ఆధారంగా రసాయన ఎరువుల వినియోగం, ఆయిల్ ఫామ్, ప్రకృతి వ్యవసాయం, కూరగాయల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, కరీంనగర్ శాస్త్రవేత్త రాజేంద్ర ప్రసాద్ , మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ స్థానిక, ఏఈఓ రాజు ప్రజాప్రతినిధులు గ్రామ సర్పంచ్ దొబ్బల మల్లేశం, క్లస్టర్ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆసుపత్రిలో క్యాంటీన్ ప్రారంభం



**ప్రజాపక్షం/గోదావరిఖని :** గోదావరిఖనిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంద్ర మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటిన్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ బుధవారం ప్రారంభించారు. ఆస్పత్రిలోని రోగులకు, వారి బంధువులకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించేందుకు ఈ క్యాంటిన్ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళా సంఘాల ద్వారా నిర్వహించే ఈ క్యాంటిన్ వల్ల వారి ఆర్థిక అభివృద్ధికి ఉపయోగపడ్తుందన్నారు. క్యాంటిన్‌ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు బొంతల రాజేష్, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# జనగణన పకడ్బందీగా పూర్తి చేయాలి



### ప్రతి ప్రభుత్వ పథకానికి ఈ గణన కీలకం

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జనగణన 2027 ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జనగణన 2027పై సెన్సెస్ ఫర్ వెల్ఫేర్ పేరిట ఈ నెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జిల్లా సమీకృత కార్యాలయం సముదాయంలో చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జీ ఆఫీసర్లుకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ హాజరై మాట్లాడారు. సెన్సెస్ చట్టం 1948 రాజ్యాంగ ప్రకారం ప్రభుత్వం జన గణన చేపడుతుందని తెలిపారు. చార్జ్ ఆఫీసర్లుగా మున్సిపాలిటీలో కమిషనర్లు, మండలాల్లో తహసీల్దార్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లుగా ఎంపీడీవోలు, మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులు ఉంటారని వెల్లడించారు. ఎన్యూమరేషన్ బ్లాక్ లో దాదాపు 700 నుంచి 800 మంది ప్రజలు ఉంటారని తెలిపారు. ఎన్యూమరేటర్, సూపర్ వైజర్లుగా ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. ఐదుగురు ఎన్యూమరేటర్లకు ఒక సూపర్ వైజర్ ఉంటారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక టెక్నికల్ సహాయకులు ఉంటారని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో డిజిటల్ విధానంలో జరిగే మొదటి జనగణనని వెల్లడించారు. మొట్ట మొదటి స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) అని వివరించారు. ఈ విధానంలో ప్రజలే తమ వివరాలు పోర్టల్ ద్వారా నమోదు చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. జిల్లా ప్రధాన గణన అధికారిగా కలెక్టర్, జిల్లా అదనపు గణన అధికారిగా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా గణన అధికారిగా శ్రీనివాసాచారి ఉంటారని తెలిపారు. మొదటి దశలో మే 11 వ తేదీ నుంచి జూన్ 09 వ తేదీ వరకు ఇండ్ల గణన నిర్వహిస్తారని, రెండో దశ ఫిబ్రవరి 2027 లో వ్యక్తుల వారిగా సమాచారం సేకరిస్తారని తెలిపారు. దీంతో ప్రతి ప్రభుత్వ పనికి సంబంధించి ఈ వివరాలు కీలకమని స్పష్టం చేశారు. జనగణనలో పాల్గొని అధికారులు బాధ్యతాయుతంగా తమ కేటాయించిన విధులను నిర్వర్తించాలని, వివరాలు పక్కాగా సేకరించి నమోదు చేయించాలని ఆదేశించారు. రోజువారి ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని ఆదేశించారు. డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ ఆపరేషన్ నుంచి స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్స్ శ్రేయ, సుమిత్ర హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా ప్రణాళిక అధికారి శ్రీనివాసాచారి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్పుద్దిన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీస్ అధికారులు, సిబ్బంది తమ వృత్తి నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. బుధవారం సాయుధ దళాల వార్షిక పునర్ ఉచ్చరణ (మోబిలైజేషన్) ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎస్పీ పరేడ్ మైదానంలో నిర్వహించిన సాయుధ దళాల సమీకరణ కవాతు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులతో పాటు ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం కూడా ఎంతో సమర్థవంతంగా పని చేస్తోందని, అదే ఉత్సాహంతో భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. వార్షిక మోబిలైజేషన్ శిక్షణలో భాగంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆర్మ్స్ డ్రిల్, లాఠీ డ్రిల్, ఫుట్ డ్రిల్, సెర్మోనియల్ డ్రిల్, గార్డ్ మౌంటింగ్, మాబ్ ఆపరేషన్, ఫైరింగ్, నాకబంది, పికెట్స్, వీఐపీ బందోబస్త్ విధులు, ప్రిసనర్ మరియు క్యాష్ ఎస్కార్ట్ వంటి అంశాలపై శిక్షణ అందించినట్లు తెలిపారు. పోలీస్ ఉద్యోగం ఎంతో బాధ్యతాయుతమైనదని, మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు తమ వృత్తి నైపుణ్యాలను మర్చిపోకుండా ఎప్పటికప్పుడు శారీరక దారుఢ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇందుకు మోబిలైజేషన్ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఫైరింగ్ శిక్షణను పరిశీలించి ఫైరింగ్‌లో పాల్గొన్నారు. ఫైరింగ్, రాత పరీక్షలు ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్ మెమొంటోలను అందజేశారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

## ఎల్పీజీ, యూరియా సమస్యలను కేంద్రం వెంటనే పరిష్కరించాలి

### పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్, యూరియా సరఫరా సమస్యలు తీవ్రరూపం దాల్చుతున్నాయని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల సమస్యల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో గత సంవత్సరం యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా మిస్మేనేజ్‌మెంట్ చేయడం వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఇప్పుడు కూడా అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఎల్పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, దాని ప్రభావం యూరియా సరఫరాపై కూడా పడే ప్రమాదం ఉందని, విదేశాంగ విధానంలో స్పష్టమైన దారి లేకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. విదేశాంగ మంత్రి డా.ఎస్. జైశంకర్ మరియు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తగిన విధంగా చర్యలు తీసుకోకపోతే దేశ వ్యాప్తంగా యూరియా కొరత మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి కొనసాగితే తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా స్పందించాలని డిమాండ్ చేశారు.

## చలివేంద్రం ప్రారంభించిన ఎస్సై



**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండల కేంద్రంలోని హిమ్మత్‌నగర్ క్రాస్ వద్ద సర్పంచ్ జడల శ్రీకాంత్, ఉపసర్పంచ్ మ్యాక శ్రీనివాస్, పాలకవర్గం వెంకన్న, రమేష్, రవీందర్, స్వప్న, నవ్య, రమ, వినోదల ఆద్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ ఆవుల తిరుపతి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ వేసవిలో మంచినీళ్లు ప్రజలకు, బాటసారులకు ఎంతో ఉపయోగపడతాయని, చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి నల్ల మమతా తిరుపతిరెడ్డి, నాయకులు లకోట వెంకన్న, సదాశివరెడ్డి, రమేష్, సంపత్, శ్రీనివాస్, కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎద్దుగుట్ట మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 8వ వార్డ్ ఎద్దు గుట్ట మల్లన్న స్వామి కళ్యాణ మహోత్సవంను యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మల్లన్న స్వామి కృపతో ప్రజలందరు సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో సంతోషకరమైన జీవితం గడపాలని పాడిపంటలు వ్యాపార అభివృద్ధి కలగాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కళ్యాణానికి కౌన్సిలర్ సభ్యులు లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, దొంతినేని కళ్యాణి అశోక్ రావు, దార్నం అరుణ లక్ష్మీ నారాయణ, ఎలుక వెంకటేశం, జిందం చక్రపాణి, మంచే శ్రీనివాస్,గుండ్లపల్లి పూర్ణచందర్, భూక్య రెడ్డి నాయక్, జెల్ల కిషన్, దిడ్డి శ్రీనివాస్, దొంతినేని అశోక్ రావు, దేవయ్య, యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య



### మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్

**ప్రజాపక్షం/గొల్లపల్లి/జగిత్యాల రూరల్ :** చదువు మించిన ఆస్తి లేదని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మ ణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం గుల్ల కోట గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్స్ ను మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన మంత్రి అడ్లూరికి పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మ ణ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజంలో చదువును మించిన ఆస్తి లేదని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న అనేక మంది గొప్ప వ్యక్తులు అయ్యారని ముఖ్యమంత్రి విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపు పాఠశాలల్లో పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలో రోడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

**మెగా ఎడ్యుకేషన్ ఫేర్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి అడ్లూరి**



జగిత్యాల పట్టణంలో తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో మార్చి 15 వ తేదీ ఆదివారం రోజున కరీంనగర్ పట్టణంలోని టి.ఎన్.జి.ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మెగా ఎడ్యుకేషన్ ఫేర్‌కు సంబంధించిన పోస్టర్‌ను సోషల్ వెల్ఫేర్ మినిస్టర్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ జగిత్యాల ఎమ్మెల్యే డా.ఎం.సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ చేతుల మీదుగా బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ తర్వాత ఉన్నత విద్య అవకాశాలపై విద్యార్థులకు సరైన అవగాహన కల్పించేందుకు మెగా ఎడ్యుకేషన్ ఫేర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి చైర్మన్ తారక్ గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముసిపట్ల రాజేందర్, ముసిపట్ల దేవేందర్, కరీంనగర్ టౌన్ ప్రెసిడెంట్ ప్రవీణ్ రాజ్, రవీందర్, తెలంగాణ విద్యా సమితి నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఛత్రపతి సంభాజీ మహారాజ్‌కు నివాళి



ప్రజాపక్షం/బైంసా : ఆరె మరాఠా సంఘం సభ్యులు ఛత్రపతి సంబాజీ మహారాజ్‌కు బుధవారం సంఘం భవన కార్యాలయంలో నివాళి అర్పించారు. ఈ సందర్బంగా ఆరె మరాఠా సంఘం అధ్యక్షుడు కద మోహన్ రావు పాటిల మాట్లాడుతూ సనాతన ధర్మం కోసం బహుజనుల కోసం ప్రాణ త్యాగం చేసిన సంబాజీ మహారాజ్ చిరస్మరణీయుడని అన్నారు. ప్రతి ఒక్కరూ సంబాజీ మహారాజ్ అడుగుజాడల్లో నడవాలని అన్నారు.ధర్మ రక్షణ కోసం ఆయన చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ప్రాణాలు పోయినప్పటికీ ధర్మం వీడని ధీరుడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పారె మరాఠా సంఘం గౌరవ అధ్యక్షుడు జాధవ్ పుండలిక్ రావు పాటిల్,నాయకులు కంఠాళె రఘువీర్ పాటిల్, సుమిత్ పాటిల్, సంతోష్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండల అంగన్వాడీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ని ఆయన నివాసంలో కలిసి అంగన్వాడీల సమస్యల పరిష్కారానికై రానున్న అసెంబ్లీ సమావేశంలో గళం ఎత్తాలని పెంచిన జీతాలను,రిటైర్మెంట్ బెనిఫిట్లను టీచర్లకు ఆయాలకు తక్షణమే అందించాలని, ఖాళీల భర్తీని వెంటనే పూర్తి చేయాలని పలు డిమాండ్లతో కూడిన మెమోరండని బుధవారం అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ సమస్యలపై సమయానుసారం గళం విప్పుతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధా, ప్రేమాబాయి, శ్రీలత, భూమవ్వ, నాగమణి, అనిల్ భూవనేశ్వరి, కమలపాల్గొన్నారు.

## నర్సరీ మొక్కలను పరిశీలించిన ఎంపిడిఓ



ప్రజాపక్షం/మామడ : మామడ మండలం దిమ్మదుర్తి గ్రామంలోని నర్సరీ మొక్కలను మండల ఎంపీడీవో సుశీల్ రెడ్డి బుధవారం పరిశీలించి నర్సరీలో పెరుగుతున్న మొక్కల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మొక్కలకు క్రమం తప్పకుండ నీరు అందించాలని, మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రజా పాలనప్రగతి పాలనలో భాగంగా గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్, ఉపసర్పంచ్ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి గీతారాణి, ఎఫ్ఏ సుధాకర్, పంచాయతీ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకే పోలీస్ సేవలు

పజాపక్షం/బైంసా : జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించి,బాధితులకు అండగా నిలవడమే లక్ష్యంగా నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ బుధవారం బైంసాలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే (ప్రజా ఫిర్యాదుల విభాగం) నిర్వహించారు.బైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన బాధితులు ఈ కార్యక్రమానికి తరలివచ్చి తమ సమస్యలను ఎస్పీ కి వివరించారు.ఫిర్యాదులపై తక్షణ స్పందన ఈ గ్రీవెన్స్ డే సందర్భంగా సుమారు 11మంది అర్జీదారులు తమ ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు.ప్రతి అభ్యర్థనను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ,అక్కడికక్కడే స్పందించారు.ఫిర్యాదుదారులు ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి కేసుల పురోగతిపై ఆరా తీశారు.బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే అందించాలని,సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు.విడిపోయిన కుటుంబాలను కలిపిన 'షి టీం' ఈ కార్యక్రమంలో భాగంగా వచ్చిన కొన్ని కుటుంబ వివా




దాలపై ఎస్పీ ప్రత్యేక చొరవ చూపారు.షీ టీం సిబ్బంది ద్వారా ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించేలా చర్యలు చేపట్టారు.ఎస్పీ సమక్షంలో జరిగిన ఈ కౌన్సిలింగ్ సత్ఫలితాలనిచ్చింది.మనస్పర్థలతో విడిపోయిన కొన్ని కుటుంబాలు తిరిగి కలుసుకున్నాయి. పెండింగ్ ఫిర్యాదులపై గట్టి నిఘా కొత్త ఫిర్యాదుల స్వీకరణతో పాటు,గతంలో గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదుల స్థితిగతులపై కూడా ఎస్పీ సమీక్షించారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా,ప్రతి ఫిర్యాదును వేగంగా పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ట్రంప్–మోడీ ఒప్పందాలను తిప్పికొట్టాలి



ప్రజాపక్షం/జన్నారం : అమెరికా అధ్యక్షుడితో కుదుర్చుకున్న ఒప్పందాలు దేశ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని, ప్రజా ఉద్యమాల ద్వారా వాటిని తిప్పికొట్టాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 15న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సెమినార్ వివరాలను వెల్లడించేందుకు బుధవారం జన్నారంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న ఆలస్యం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన పోరాటాలపై ఈ సెమినార్‌లో చర్చించనున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జన్నారం మండల కార్యదర్శి కొండగోర్ల లింగన్న, నాయకులు ఎస్కే అబ్దుల్లా, ఒడిపెల్లి చంద్రన్న, దుర్గం దుర్గ ప్రసాద్, గంగు పటేల్ పాల్గొన్నారు.

# ఎఐ విద్యాబోధనతో విద్యార్థుల్లో పురోగతి

### జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్




ప్రజాపక్షం/కాగజ్ నగర్ : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత విద్యాబోధన ద్వారా విద్యార్థులు గణితం, భాషా సబ్జెక్టుల్లో గణనీయమైన పురోగతి సాధిస్తున్నారని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కాగజ్ నగర్ పట్టణంలోని ఫాతిమా కాన్వెంట్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 14 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రస్తుతం ఈ విధానం అమలవుతోందని, త్వరలో మరో నాలుగు పాఠశాలల్లో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఫండమెంటల్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా 3, 4, 5 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ఎఐ సహాయపడుతుందని శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యానికి అనుగుణంగా నేర్చుకునే అవకాశం ఉంటుందని, పాఠాల ప్రణాళిక, మూల్యాంకనంలో ఉపాధ్యాయులకు ఎఎక్స్ఎల్ సాంకేతికత తోడ్పడుతుందని వివరించారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్, రిసోర్స్ పర్సన్లు శివ రాజ్, సంజయ్, మహేశ్వర్, జలపతిరావు పాల్గొన్నారు.

# ప్రైవేటు పనులకు పంచాయతీ ట్రాక్టర్ వాడకం

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ గ్రామపంచాయతీ ట్రాక్టర్ ను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పనులకు వాడుతున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త తొలగింపు, ఇతర పంచాయతీ పనులకు వినియోగించాల్సిన వాహనాన్ని ప్రైవేట్ వ్యక్తుల పశువుల మేత (కుటార) తరలించేందుకు వాడుతుండగా బుధవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. గత 15 రోజుల క్రితం డ్రైనేజీ కాల్వల్లో తీసిన పూడికను రోడ్లపైనే వదిలేసి, వాహనాన్ని వ్యక్తిగత పనులకు తరలించడంపై వారు అధికారులను ప్రశ్నించారు. గ్రామపంచాయతీ ఆస్తులను స్వార్థ ప్రయోజనాల కోసం వాడుతున్న పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, ఉప సర్పంచ్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతో నడిచే వాహనాలను ప్రైవేటు వ్యక్తుల పనులకు విని



యోగించడం వల్ల గ్రామ పారిశుధ్యం కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విచారణ జరపాలని వారు కోరారు.

## ఆధ్యాత్మికతతో సాధు సమ్మేళన



ప్రజాపక్షం/నేరడిగొండ : నేరడిగొండ మండలంలోని తేజాపూర్ గ్రామంలో రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గత నాలుగు రోజుల నుండి జరిగే వేదాంత విజ్ఞాన సాధు సమ్మేళన మహాసభలు ఆధ్యాత్మిక చింతనతో శివానంద భారతి స్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలతో ఆధ్యాంతం కొనసాగాయి.ఈ కార్యక్రమాలకు బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్,బోథ్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్, హాజరై మాట్లాడుతూ సాధుసంతుల కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు మనం ధర్మాన్ని కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుందని నేటి యువత చెడు మార్గం వైపు నడవకుండా ఆధ్యాత్మికం వైపు నడవాలని సూచించారు. గొప్ప విలువలతో కూడిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ద్వారా నేర్చుకున్న జ్ఞానాన్ని అందరు పాటించి సన్మార్గంలో నడిచి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లాల చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు సమస్యను విన్నవించిన అంగన్వాడీ టీచర్లు



ప్రజాపక్షం/బైంసా : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉపాధ్యాయులు బుధవారం ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కు వినతి పత్రాన్ని అందించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లకు మేనిఫెస్టో లో ఇచ్చిన హామీలు నెరవేర్యలా చూడాలని కోరారు.తమకు బి.ఎల్.వో.డ్యూటీలు వేయకుండా చూడాలన్నారు. బి.ఎల్.వో డ్యూటీలు వేయడం మూలంగా వృత్తి పరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అదేవిధంగా పలు సమస్యలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ అంగన్వాడీ టీచర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో టీచర్లు, డి.అనసూయ, ఎ.సంధ్యారాణి, ఎన్.సంతోషి, జి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రజాపక్షం/బైంసా : గ్రామంలో ప్రజలకు స్వచ్ఛత పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరికి ఉందని దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి అన్నారు.బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి పాలనపై గ్రామ స్థాయి అధికారులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సౌజన్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు.మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రతి ఇంట పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని అన్నారు.హెల్త్ సిబ్బంది ప్రజారోగ్యం పై దృష్టి సారించాలని సూచించారు.గ్రామ సిబ్బంది పారిశుధ్య పనులు నిరంతరం చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భోజన్న,తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో రీడింగ్ కార్నర్

ప్రజాపక్షం/జన్నారం : విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంచడానికి రీడింగ్ రూమ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తపాలాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దుంపల తిరుపతి తెలిపారు. బుధవారం జన్నారం మండలంలోని సింగరాయపేట్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్య కోసం ఏర్పాటు చేసిన ప్లే కమ్ రీడింగ్ కార్నర్ గదిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని, పాఠశాలలో కల్పించిన ఈ సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆటపాటలతో కూడిన విద్యాబోధన వల్ల పిల్లల్లో అభ్యసన సామర్థ్యం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సమన్వయకర్త రవి, సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ వరలక్ష్మి , ఉపాధ్యాయులు శిరీష, పద్మ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు ప్రొఫెషనల్ టాక్స్ చెల్లించాలి



ప్రజాపక్షం/జన్నారం : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రొఫెషనల్ టాక్స్‌ను తప్పనిసరిగా చెల్లించాలని మండల విద్యాధికారి విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీలోపు పన్ను చెల్లించి, దానికి సంబంధించిన రసీదులను కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలను అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు విధిగా పాటించాలని, ఉపాధ్యాయుల సంక్షేమం దృష్ట్యా ఈ చర్యలు తీసుకోవాలని ఎంఈఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు మధుసూదన్, శ్రీనివాస్, సతీష్ గౌడ్, రవీందర్, కస్తూరి సతీష్ పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ప్రజాపక్షం/పెంచికలపేట్ : చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని పెంచికలపేట్ మండలంలోని గుంట్లపేట్ గ్రామ సర్పంచ్ దుర్గం పోషన్న తెలిపారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎఎల్‌ఎంఎస్‌సి కమిటీని ఏర్పాటు చేసి, లబ్ధిదారులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్ల వల్ల అనారోగ్య సమస్యలు తగ్గుతాయని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలతో కూడిన ఆహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చిన్నయ్య, వార్డు సభ్యులు తోగం సాయి, నాయకులు వెంకటాచలం, అంగన్‌వాడీ టీచర్ రాజమణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భద్రతా నియమాలతోనే ప్రమాదాల నివారణ



ప్రజాపక్షం/కాగజ్ నగర్ : పరిశ్రమల్లోనే కాకుండా దైనందిన జీవితంలోనూ భద్రతా నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఎస్‌పిఎం అధికారులు ఎకె మిశ్రా, సిహెచ్ లక్ష్మీ కుమార్, ఎంఎస్ గిరి పేర్కొన్నారు. బుధవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎస్‌పిఎం ఉద్యోగులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాక్టరీల శాఖ సూచనల మేరకు 99 రోజుల ప్రణాళిక అమలు, భద్రతా దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని ముఖ్య వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో భద్రతా ప్రమాణాల ప్రాముఖ్యతను వివరించారు. భద్రతే అభివృద్ధికి మూలాధారమని, పని చేసే ప్రతి ఉద్యోగి రక్షణ కవచాలను తప్పనిసరిగా ధరించాలని అధికారులు సూచించారు. భద్రతపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఉద్యోగులు భద్రతకు సంబంధించిన నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎ కె మిశ్రా, సిహెచ్ లక్ష్మీ కుమార్, ఎం ఎస్ గిరి, శ్రీనివాస్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

# డివిజన్లలో ముమ్మరంగా పారిశుధ్య పనులు



ప్రజాపక్షం/హాజీపూర్ : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. శనివారం 18వ డివిజన్ పరిధిలోని నమ్నూర్, గుడిపేట్ పునరావాస కాలనీల్లో జేసీబీలు, ట్రాక్టర్ల సహాయంతో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. పాడైపోయిన సిసి రోడ్డు గుంతలను పూడ్చివేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. మేయర్ దర్ని మధుకర్, కమిషనర్ అన్వేష్, స్థానిక కార్పొరేటర్ రాచమల్లు కమల శ్రీనివాస్ గౌడ్ తో కలిసి వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 18వ డివిజన్ లో గురువారం వరకు ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల పారిశుధ్య చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాల్వల్లో పూడికతీతతో పాటు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. వార్డుల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కుమార్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుడుంబా మహమ్మారిని అంతం చేద్దాం

### చెన్నూరు రూరల్ సిఐ కృష్ణ



ప్రజాపక్షం/కోటపెల్లి : గుడుంబా మహమ్మారి వల్ల యువత వ్యసనపరులై ప్రాణాలు కోల్పోతున్నారని, పచ్చని కుటుంబాలు రోడ్డున పడకుండా అల్గాంను నాటుసారా రహిత గ్రామంగా మార్చాలని చెన్నూరు రూరల్ సిఐ కృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాల జిల్లా కోటపెల్లి మండలం అల్గాం గ్రామంలో పోలీస్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించాయి. గ్రామంలోని గుడుంబా ప్రభావిత ప్రాంతాల్లో గడపగడపకూ తనిఖీలు చేపట్టిన అధికారులు గుడుంబా తయారీ కేంద్రాలను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో దాదాపు 1500 లీటర్ల బెల్లం పానకాన్ని స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే పారబోశారు. నలుగురు మహిళల నుంచి 70 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ హరి వెల్లడించారు. ఈ సందర్భంగా సిఐ కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా, దానికి అవసరమైన ముడి సరుకులు సరఫరా చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటుసారా తయారీలో వాడే పాత్రలు, డ్రమ్ముల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామ సర్పంచ్‌లు చొరవ చూపి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, నిషేధ తీర్మానాలు చేపట్టాలని కోరారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి గుడుంబా నిర్మూలనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిఐ సమ్మయ్య, కోటపెల్లి ఎస్ఐ రాజశేఖర్, ఎక్సైజ్ ఎస్ఐ వెంకటరమణ, ఉభయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతిభను వెలికి తీసేందుకే టాలెంట్ టెస్ట్



ప్రజాపక్షం/జన్నారం : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి టాలెంట్ టెస్ట్‌లు ఎంతో ఉపయోగకరమని మండల విద్యాధికారి విజయ్ కుమార్, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం జన్నారం మండల కేంద్రంలో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ పోటీల్లో స్లేట్ హై స్కూల్‌కు చెందిన అల్వియా షిఫాలీ మొదటి స్థానం, లిటిల్ హాన్స్ స్కూల్‌కు చెందిన డెరిన్ సైజు రెండో స్థానం, జయరాణి స్కూల్‌కు చెందిన అక్షర మూడో స్థానంలో నిలిచారు. వీరికి అధికారులు మెమెంటోలు అందజేసి అభినందించారు. వీరితో పాటు కేజీబీవీ విద్యార్థిని శివాని, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు శైలజ, రమేష్, జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి సాయి తేజ, ప్రభుత్వ సెకండరీ పాఠశాల విద్యార్థిని అక్షిత ప్రతిభ కనబరిచారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి అల్లం సాయి తేజ, ఉపాధ్యక్షుడు మణి చరణ్, కమిటీ సభ్యుడు రెహమాన్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడవుల్లో నిప్పు పెడితే కఠిన చర్యలు



ప్రజాపక్షం/కాసిపేట : అడవుల్లో కావాలని నిప్పు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్ హెచ్చరించారు. బుధవారం ముత్యంపల్లి సెక్షన్ పరిధిలోని పెద్దధర్మారం అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలకు అటవీ మంటల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సెక్షన్ పరిధిలో చెలరేగిన మంటలను అదుపులోకి తీసుకువచ్చామని, వేసవిలో అడవులకు నిప్పు పెట్టడం వల్ల వన్యప్రాణులు, పక్షులు, ఔషధ మొక్కల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. అటవీ మంటల వల్ల భూమి సారవంతత తగ్గడమే కాకుండా వాయు, జల కాలుష్యం పెరుగుతుందని ప్రవీణ్ నాయక్ పేర్కొన్నారు. అడవుల్లో అగ్గి పెట్టే వారి సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు అందించాలని కోరారు. పదేపదే అవగాహన కల్పిస్తున్నా కొంత మంది కావాలనే చేసే ఇటువంటి పనుల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాల పంపిణీ



ప్రజాపక్షం/హాజీపూర్ : మండలంలోని రాపల్లి గ్రామంలో బుధవారం ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్య శాఖ అధికారులు ప్రారంభించారు. ఈ శిబిరంలో 38 గేదెలకు, 56 ఆవులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఏప్రిల్ 10 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. రైతులు తమ పశువులను గాలి కుంటు వ్యాధి నుండి రక్షించుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుపోషకులు టీకాలు వేయించిన తర్వాత భారత్ పశుధన్ యాప్ ద్వారా తమ ఆధార్ నంబర్‌ను ఓటీపీ సహాయంతో వెరిఫై చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి డాక్టర్ శాంతి రేఖ, ఎల్ఎస్ఏ సంపత్, పశువైద్య సహాయకులు అశోక్ పాల్గొన్నారు.

## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి




ప్రజాపక్షం/రెబ్బెన : పరీక్షల సమయంలో విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ఎస్పి చిత్తరంజన్ సూచించారు. బుధవారం రెబ్బెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గురుకుల పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, వాటర్ బాటిళ్లు, పరీక్ష ప్యాడ్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో పరీక్షల సమయం కీలకమైన దశ అని, క్రమశిక్షణతో చదివిన వారు తప్పకుండా ఉత్తమ ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. భయం వీడి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమయపాలన పాటిస్తూ ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా అర్థం చేసుకుని సమాధానాలు రాయడం ద్వారా మంచి మార్కులు పొందవచ్చని ఎస్‌పి తెలిపారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతుందని, నేరాల నిర్మూలనలో భాగంగా కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రెబ్బెన సిఐ సంజయ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి కార్యకర్తలు పునరంకితం కావాలి

డిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/నిర్మల్ :** రాష్ట్ర అభివృద్ధి,సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు,ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పష్టం చేశారు.నిర్మల్ జిల్లా కేంద్రంలోని హోటల్ మారుతిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా పార్టీ విజయానికి కృషి చేసిన కౌన్సిలర్లను ఆయన ఘనంగా సన్మానించి,అభినందనలు తెలియజేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ,పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు అతి త్వరలోనే జిల్లా వ్యాప్తంగా మండల,జిల్లా స్థాయి కమిటీలను పునర్వ్యవస్థీకరించనున్నట్లు ప్రకటించారు.పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నిజమైన కార్యకర్తలకు ఈ కమిటీల్లో సముచిత స్థానం కల్పిస్తామని ఆయనహామీ ఇచ్చారు .కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో,ముఖ్యంగా బూత్ లెవల్ నుండి పటిష్టం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యకర్తలే పార్టీకి మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లడంలో అందరి సహకారం అత్యవసరమని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ చంద్రశేఖర్ గౌడ్,నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి శ్రీహరి రావు,మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి,తమ ప్రసంగాల ద్వారా కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ,ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి,అవేజ్,ఎంబడి రాజేశ్వర్ తదితరులు పాల్గొని పార్టీ బలోపేతంపై చర్చించారు.ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు,అనుబంధ సంఘాల ప్రతినిధులు,కార్యకర్తలు హాజరయ్యారు.

# గాలికుంటు టీకాలు వేయించుకోవాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండల వ్యాప్తంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం నేరడిగొండ పంచాయతీ పరిధిలో సర్పంచ్ నీలిమ రవీందర్‌రెడ్డి,తో ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పశు సంపదను కాపాడడానికి గాలికుంటు నివారణ టీకాలు ముందస్తు జాగ్రత్తగా పాడి రైతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉచితంగా చేపడుతున్న కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది డాక్టర్ జీవన్ రాథోడ్,వెంకన్న,సాబ్లే సంతోష్, రైతులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ పూర్తి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల కోసం నామినేషన్‌ల దాఖలు ప్రక్రియ పూర్తయింది. జనరల్ సెక్రటరీ పదవికి పసుల రాజలింగం,ఉపాధ్యక్ష పదవికి పొలంపల్లి రాజు,ట్రెజరర్ పదవికి కె.యోగిత, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి లలిత కుమారి,స్పోర్ట్స్ అండ్ గేమ్స్ సెక్రటరీ పదవికి ఐ.వెంకటేష్,లైబ్రరీ సెక్రటరీ పదవికి తులాల సురేందర్ నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు కామోజీ వేణు గోపాల్, షబ్బీర్ పాషా తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో గాయాలు. . చికిత్స పొందుతూ ఒకరి మృతి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని బెజ్జొరా గ్రామానికి చెందిన శ్రీరాం రవి కాంగ్రెస్ పార్టీ కాన్స్టెన్సీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా కష్టకాలంలో సోషల్ మీడియా ద్వారా సేవలందించిన యువనాయకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆగస్టు 10న కొత్తగూడెంలో చోటు చేసుకుంది. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావటంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఇంటికి తీసుకవచ్చి వైద్యుల సూచనల మేరకు కుటుంబ సభ్యులు సేవలందించారు. కోలుకుంటున్న సమయం లో శ్వాస ఇబ్బందితో మంగళవారం తుదిశ్వాస విడిచారు. బుధవారం రవి అంత్యక్రియలకు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హాజరై కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# లక్ష్యసాధనలో పాఠశాలకు పేరు తీసుకురావాలి

ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ పద్మ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు గత ఐదు సంవత్సరాలుగా ఈ పాఠశాలలో తమకు ఉన్న అనుబంధాన్ని ఉపాధ్యాయుల ప్రోత్సాహాన్ని,మధుర స్మృతులను అందరితో పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ పద్మ మాట్లాడుతూ,విద్యార్థులు క్రమశిక్షణతో చదివి రాబోయే పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలోనే అత్యుత్తమ ర్యాంకులు సాధించి పాఠశాలకు,తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికాబద్ధంగా చదవాలని ఆమె విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ వస్తవ్యులు,ప్రముఖ కాంట్రాక్టర్ శ్రీనివాస్ విద్యార్థులకు అండగా నిలిచారు.పరీక్షలకు హాజరవుతున్న 60 మంది విద్యార్థులకు అవసరమైన జామెట్రీ బాక్సులు,స్కేళ్లు,పెన్నులు,పెన్సిళ్లను ఆయన స్వయంగా బహుకరించారు.విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.ఈ వీడ్కోలు వేడుకలో ఉపాధ్యాయ బృందం సంతోష్ కుమార్,రాజేందర్,చట్ల శ్రీనివాస్,సురేందర్,మోరే శ్రీనివాస్,మసియుద్దీన్,సత్తయ్య,విద్యారాణి,ఆశా కిరణ్,సునీత,ముతన్న,రాజ్ కుమార్,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాయపడిన వారిని పరామర్శించిన ఎఎస్పీ, టౌన్ సిఐ



**ప్రజాపక్షం/బైంసా :** బాసరలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఒక ఆర్టీసీ బస్సు, ఒక లారీ మధ్య ప్రమాదశాత్తు రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ బ్రిడ్జి వద్ద యూ టర్న్ తీసుకునే సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది.ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌తో పాటు మొత్తం నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. వెంటనే బాసర పోలీస్ సిబ్బంది స్పందించి గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్పీ నిర్మల్ సిఐ బైంసా ఆసుపత్రిని సందర్శించి గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. గాయపడిన వారిలో ఒక మహిళకు కంటికి గాయం కాగా,మిగిలిన వారికి స్వల్ప గాయాలు ఉన్నట్లు వైద్యులు తెలిపారు.గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఏఎస్పీ నిర్మల్ వైద్యులను కోరారు.ఈ ప్రమాదానికి కారణమైన లారీని లారీ డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి



**పజాపక్షం/నిజామాబాద్ :** విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్ అన్నారు. బుధవారం ఆర్సపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సొసైటీ సోల్జర్స్ యూత్ ఆధ్వర్యంలో విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయవాద పరిషత్ జిల్లా అధ్యక్షులు జగన్మోహన్‌గౌడ్ విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు సరైన ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలని ప్రణాళికబద్ధంగా చదువుకుని కొనసాగించాలని దేశభక్తి సామాజిక స్పృహతో ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా సొసైటీ సోల్జర్స్ యూత్ అధ్యక్షులు మేదర్ శేఖర్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో విద్యార్థులు కంగారు పడకుండా తమ లక్ష్యం వైపు ముందుకు సాగాలని తమ లక్ష్యంలో ఏవైనా అడ్డకుంలు వస్తే స్వామి వివేకానంద, ఎపిజె అబ్దుల్ కలాం వంటి మహానీయులను స్ఫూర్తిదాయకంగా తీసుకుని ముందుకు సాగుతూ లక్ష్యాలను ఛేదించాలని వారి ఆదర్శాలను మన జీవితంలో ఇనుమడిపంజేసుకుని మన జీవితాలను మెరుగుపర్చుకుని వాటితో పాటు సమాజ సేవ కార్యక్రమంలో కూడా ముందుండాలని తెలిపారు. ఈ సందర్భంగా భాగంగా పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ బెల్లల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, యూత్ సభ్యులు కుచ్చుల సంజు, దండు చందు, గుడుమల నితిన్ పాల్గొన్నారు.



# అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ఏలేటి శంకుస్థాపన

**ప్రజాపక్షం/సారంగాపూర్ :** సారంగాపూర్ మండలంలోని ధని గ్రామంలో రూ.20 లక్షలతో రెండు ఎస్.హెచ్.జి (వి.ఓ) భవనాల నిర్మాణానికి,రూ.20 లక్షలతో రెండు వర్కింగ్ షెడ్ ల నిర్మాణానికి,రూ.12 లక్షలతో అంగన్వాడీ భవన నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి,గ్రామ సర్పంచ్ పోతన్న,నాయకులు రాజేందర్ రెడ్డి,విలాస్.తోపాటు మండల బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బడాభీమ్‌గల్‌లో ఎంపిడిఓ తాగునీటి వనరుల పరిశీలన

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 యాక్షన్ ప్లాన్‌లో భాగంగా బుధవారం బడాభీమ్‌గల్‌లో పారిశుధ్య పనులు ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులు మినీ వాటర్ ట్యాంకుల క్లీనింగ్ పనులను ఎంపీడీఓ గంగుల సంతోష్‌కుమార్ పరిశీలించారు. రాబోయే వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం జడ్పీహెచ్ఎస్‌లో నిర్మాణంలోని అదనపు తరగతులను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. 14 నుండి 10వ తరగతి వార్షిక పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించటానికి తగు సూచనలు అందజేశారు. గ్రామపంచాయతీలో మహిళా సంఘ విఓలు విఓఎలకు తడి, పొడి చెత్త నిర్వాణమైన అవగాహన కల్పించటం జరిగింది. ఎంపీపీ జావిద్‌అలీ, ఏఈ అమూల్య, సర్పంచ్ విష్ణువర్ధిని, ఉపసర్పంచ్ శంకర్‌గౌడ్, పంచాయతీ సెక్రటరీ రజిత, సిబ్బంది, మహిళ సంఘ సిబ్బంది పాల్గొన్నారు.




# గ్రామసభ విజయవంతం

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మండలంలోని చేపూర్ గ్రామంలో బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభ విజయవంతమైనట్లు సర్పంచ్ సారంగి శాంతికుమార్ తెలిపారు. ఈ సభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు అభివృద్ధి అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. గ్రామంలో మౌలిక వసతులు పారిశుధ్య నిర్వహణ తాగునీటి సరఫరా వీధిదీపాలు, డ్రైనేజీ వ్యవస్థపై గ్రామస్తులు సభ దృష్టికి తీసుకవచ్చారు. కొత్త బోర్ల కొనుగోలు చేయటం గ్రామంలోని అవసరాలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. గ్రామాభివృద్ధి లక్ష్యంగా ప్రజల సమస్యలపై ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గ్రామసభలో సభ్యులు మాట్లాడిన ప్రతి అంశాన్ని పరిశీలించి పరిష్కారం చేస్తానని తెలిపారు. గ్రామసభకు హాజరైన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సింధుకార్ చరణ్, కార్యదర్శి లోక హరీష్‌రెడ్డి, పశువుల డాక్టర్ రాజేశ్వర్, జీపీఓ జక్కా శ్రావణ్, వార్డు మెంబర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

# హనుమాన్ మాలధారి పట్ల టీచర్ అనుచిత వ్యాఖ్యలు

## మంగల్పహాడ్‌లో ఉద్రిక్తత, రాస్తారోకో



**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం మంగల్పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయురాలు హనుమాన్ మాల ధరించిన విద్యార్థిని కించపరిచేలా మాట్లాడటం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. మత విశ్వాసాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన సదరు ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు, హనుమాన్ స్వాములు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మంగల్పహాడ్ గ్రామానికి చెందిన పదవ తరగతి విద్యార్థి హర్షిత్ గౌడ్ సోమవారం హనుమాన్ మాల ధరించాడు. దీక్షలో భాగంగా పాఠశాలకు వెళ్లిన హర్షిత్ పట్ల ఉపాధ్యాయురాలు పద్మజ దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. మాల ధారణను ఉద్దేశించి ఏందిరా ఈ విషం..? అంటూ కించపరిచేలా వ్యాఖ్యానించడంతో విద్యార్థి మనస్థాపానికి గురయ్యాడు. సోమ, మంగళ వారాల్లో వరుసగా ఉపాధ్యాయురాలు ఇదే తీరుగా వ్యవహరించడంతో, విద్యార్థి ఈ విషయాన్ని మంగళవారం సాయంత్రం తన తల్లిదండ్రులకు వివరించాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, మండలంలోని హనుమాన్ మాల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయురాలి తీరుకు నిరసనగా బుధవారం సుమారు 30మందికి పైగా హనుమాన్ స్వాములు, గ్రామస్తులు పాఠశాలను ముట్టడించారు. అనంతరం మంగల్పహాడ్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఉపాధ్యాయురాలి తీరుకు నిరసనగా బుధవారం సుమారు 30మందికి పైగా హనుమాన్ స్వాములు, గ్రామస్తులు పాఠశాలను ముట్టడించారు. అనంతరం మంగళ్పాహాడ్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఉపాధ్యాయురాలిని తక్షణమే సస్పెండ్ చేయాలని, ఆమెపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకున్న ఎడపల్లి ఎస్సై రమ, ఎడపల్లి మండల విద్యాశాఖ అధికారి గాలప్ప ఘటనా స్థలానికి చేరుకొని నిరసన కారులతో చర్చలు జరిపారు. పాఠశాలకు వెళ్లి సదరు ఉపాధ్యాయురాలి నుంచి వివరణ కోరారు. విద్యార్థి తల్లిదండ్రులకు, భక్తులకు నచ్చచెప్పిన ఎంఈఓ, ఎస్సై ఈ ఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక అందచేస్తామని, ఉపాధ్యాయురాలిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అధికారుల హామీతో భక్తులు ఆందోళనను విరమించారు. మతపరమైన దీక్షలను, విద్యార్థుల మనోభావాలను గౌరవించాల్సిన ఉపాధ్యాయులే ఇలా ప్రవర్తించడం సరికాదని, భాధ్యురాలిపై కఠిన చర్యలు తీసుకునే వరకు వదిలే ప్రసక్తే లేదని ఆందోళనకారులు పేర్కొన్నారు.



## బకాయి జీతాలు చెల్లించాలని సర్పంచ్‌కు వినతిపత్రం

**ప్రజాపక్షం/ఎడపల్లి :** ఎడపల్లి గ్రామ పంచాయతీ కార్మికులు తమకు రావాల్సిన మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కందగట్ల రాంచందర్ కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వెంటనే బకాయి జీతాలు చెల్లించి తమ సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ జే.పద్మ, మండల నాయకులు ఆర్.మహేష్, నాయకురాలు లక్ష్మి, మల్లమ్మ, సులోచన, భూదేవి, రాధా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## బాపు నగర్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

### మహిళా ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/ఎడపల్లిః** ఆకాశంలో సగం... అవకాశాల్లో సగం అన్న నానుడిని నిజం చేస్తూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని బాపునగర్ సర్పంచ్ నగునూరి అనురాధ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎడపల్లి మండలంలోని బాపునగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా శక్తిని చాటేలా ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. గ్రామ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న మహిళా ప్రజాప్రతినిధులను, అధికారులను ఈ సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు. సర్పంచ్ అనురాధ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ పద్మను, మహిళా వార్డు సభ్యులను శాలువాలతో కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మహిళల పనితీరు, అంకిత భావం గ్రామ ప్రగతికి ఎంతో దోహదపడుతున్నాయని ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం సెక్రెటరీ పద్మ, మహిళా వార్డు సభ్యులు కలిసి సర్పంచ్ అనురాధను శాలువాతో సన్మానించి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటూ ఆత్మీయంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. నేడు మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, పాలనలోనూ తమదైన ముద్ర వేస్తున్నారన్నారు. సంపూర్ణ మహిళా సాధికారిత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని, బాపునగర్ గ్రామ పంచాయతీలో మహిళా విభాగం సమన్వయంతో పనిచేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళా వార్డు సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొని వేడుకలను జరుపుకున్నారు.

## అర్బన్‌లో డబుల్ బెడ్ రూం ఇళ్ళు అర్హులకు అందించాలి

### నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా



**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** నిజామాబాద్ అర్బన్‌లో అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను అందించాలని, పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు మరమ్మతులు చేయించి నిరుపేదలకు అందించాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. అభివృద్ధి పనులపై గత 12 రోజుల నుండి 12 శాఖల ముఖ్య అధికారులతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో రివ్యు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ళు, డబుల్ బెడ్‌రూంలను త్వరగా మరమ్మతులు నిర్వహించి ఆరునెలల్లో నిరుపేదలకు అందించాలని, ప్రభుత్వం నుండి రావలసిన యుజిడి పనుల నిధుల విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. బోధన్ బస్టాండ్ సమీపంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ మరమ్మతులను పూర్తిచేసి అర్హులైన వారికి కేటాయించాలన్నారు.

## ఆత్మవిశ్వాసంతో చదివి మంచి ఫలితాలు సాధించాలి

### మోర్తాడ్ ఎంఈఓ సమ్మిరెడ్డి



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మోర్తాడ్ మండల విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి, పాల్గొని, పరీక్షలు బాగా రాయాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదివి మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి, వారి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని సూచించారు. అనంతరం విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చెస్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో చెస్ బోర్డుల పంపిణీ

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** చదరంగంలో గ్రామీణ జీవితంలో అంతర్భాగంగా మార్చాలని లక్ష్యంగా గ్రేటర్ అట్లంట తెలంగాణ సొసైటీ అధ్యక్షులు గండ్ర వెంకటరమణారావు సహకారంతో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల పరిధిలోని 44 జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలకు చెస్ బోర్డులు పంపిణీ కార్యక్రమానికి చెస్ నెట్ వర్క్ ఫౌండర్ కొండాటి సుధీర్ ముఖ్య అతిథిగా హాజరై 115 చెస్ బోర్డులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లన్న పేటలో పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా చెస్ నెట్ వర్క్ ఫౌండర్ కొండాటి సుధీర్ మాట్లాడుతూ చెస్ గేమ్ వల్ల విద్యార్థుల్లో మేధాశక్తి పెరుగుతుందని అదేవిధంగా ఆలోచనశక్తి సమస్య పరిష్కారం నైపుణ్యాలు పెరుగుతాయని అన్నారు . ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద రావు, యాల్ల అమర్నాథ్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వుటూరి మహేష్, పిఆర్‌టియు టిఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షులు వేణుగోపాలరావు, కమిటీ సభ్యులు సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హెచ్‌పివి వాక్సిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ శ్రీనివాస్

**ప్రజాపక్షం/ధర్మపురి :** మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం ముందస్తుగా తీసుకోవల్సిన హెచ్ పి వి వాక్సిన్ ను బాలికలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల జిల్లా డిప్యూటి డీఎం అండ్ హెచ్ ఓ డా. నీలారపు శ్రీనివాస్ అన్నారు. ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం 14 ఏళ్లు దాటిన బాలికలకు ప్రభుత్వం హెచ్ పి వి వాక్సిన్ ను ఉచితంగా అందిస్తున్నదని తెలిపారు. దేశంలో అతి ఎక్కవ మరణాలు గర్భాశయ క్యాన్సర్ వ్యాదులతో జరుగుతున్నాయని ఆయన తెలిపారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకై వైద్య ఆరోగ్యశాఖ అవగాహన కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. భవిష్యత్తు తరాలను ఈ వ్యాధి నుండి కాపాడేందుకు ఈ టీకా ఒక్కటే మార్గమని అందుకు ప్రతి అన్నారు. ఈకార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది తదితరులున్నారు.

## దుష్టశిక్షణ శిష్ట రక్షణకై సుదర్శన్ నారసింహ హోమం శ్రేష్టం

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** దుష్ట శిక్షణ శిష్ట రక్షణకై సుదర్శన నారసింహ హోమం శ్రేష్టమని దేవనాథ జీయర్‌స్వామి ప్రవచించారు. ఇందూరు తిమమల గోవింద వనమాల క్షేత్రం బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు బుధవారం ఉదయం సర్వరక్షా కర సుదర్శన నర్సింహ హవన కార్యక్రమాన్ని వైభంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవనాథ జీయర్ స్వామి భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. ఆరోగ్యం, సంపద, మంచి బుద్ధిలను 'సర్వ రక్షా కర సుదర్శన నర్సింహ హోమం' ప్రసాదిస్తాదన్నారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే హోమాలకు రెట్టింపైన శక్తి ఉంటుందన్నారు. దుష్ట శిక్షణ శిష్ట రక్షణకై సుదర్శన నారసింహ హోమం ఎంతో శ్రేష్టమన్నారు. విష్ణువుని దర్శింపజేసేది సుదర్శన భగవానుడేనన్నారు. సకల ద్రవ్యాల్లో, సకల వస్తువుల్లో వ్యాప్తి చెంది ఉన్న ఆ మహావిష్ణువుని మామూలు చూపుతో దర్శింపజేయటం సాధ్యం కాదు కాబట్టి కోటి సూర్య కోటి సమ ప్రభువైన సుదర్శన భగవానుడి అనుగ్రహంతో మహావిష్ణువు దర్శనభాగ్యం కలుగుతుందన్నారు. సర్వలోకాలను ఏలే మహావిష్ణువు దర్శనం కావలంటే సుదర్శన భగవానుడి అనుగ్రహం కావలని, ఆ సుదర్శన భగవానుడి అనుగ్రహం కోసం సర్వ రక్షాకర సుదర్శన నర్సింహ హోమం ఉత్తమ మార్గమమన్నారు. ఈ బ్రహ్మోత్సవాలు శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామి వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో కొనసాగుతుండగా యజ్ఞాచార్యులు లక్ష్మణ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్‌కుమార్ చార్యులు, సంపత్‌కుమార్ ఆచార్యులు నిర్వహిస్తున్నారు. నేటి బ్రహ్మోత్సవాల్లో బొమ్మరిల్లి సినిమా డైరెక్టర్ బొమ్మరిల్లు భాస్కర్ ప్రముఖ ఛాయాగ్రహకులు విజయచక్రవర్తి సినీ నిర్మాతలు కృష్ణ సత్యనారాయణరెడ్డి, మహేందర్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు ప్రముఖ సినీ నిర్మాత సోదరులు దిల్‌రాజు, శిరీష్‌రెడ్డి దంపతులు, ప్రధాన ధర్మకర్త నర్సింహారెడ్డి దంపతులు విజయసింహారెడ్డి దంపతులు బొమ్మరిల్లు సినిమా డైరెక్టర్ బొమ్మరిల్లు భాస్కర్, ప్రముఖ ఛాయాగ్రహకులు విజయ చక్రవర్తి సినీ నిర్మాతలు కృష్ణ సత్యనారాయణరెడ్డి మహేందర్ తదితర సినీ ప్రముఖులు మాజీ ఎంపీటీసీ రాములు రాజేశ్వర్, నరాల సుధాకర్, సాయిలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## 14 నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఈనెల 14 నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల కోసం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాధికారి బండారి మధు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 214 మంది,గోధూర్ ఉన్నత పాఠశాలలో 90 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. మొత్తం 24 మంది అధికారులు సెంటర్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు తదితర హోదాల్లో విధులు నిర్వహించనున్నారని తెలిపారు.పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు.విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలను సాధించాలని మండల విద్యాధికారి మధు విద్యార్థులకు సూచించారు.